

రెడ్‌క్రాస్ సొసైటీ బలోపేతానికి చర్యలు

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సుమిత్ కుమార్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కార్యవర్గం ఆసక్తికరంగా విధులు నిర్వహించక పోవటాన్ని గుర్తించటం జరిగిందన్నారు. జిల్లాలో గిరిజన ప్రజలకు అవసరమైన సేవలు అందించటం, రక్త నిల్వలు పెంపొందించడంలో ఆసక్తి, పట్టుదల, నిజాయితీలతో పనిచేయడానికి ముందుకు వచ్చే సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పాటు చేయటానికి నిర్ణయించినట్లు కలక్టర్ వివరించారు. ఆసక్తి గల ప్రస్తుత రెడ్ క్రాస్ జీవిత సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా మిత్రుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలక్టర్ తెలిపారు. నూతన కమిటీ ఏర్పాటు చేసి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయడంతో పాటు సంస్థ కార్యకలాపాలను విస్తతం చేస్తామని కలక్టర్ వివరించారు.

ఆసుపత్రుల్లో పని చేస్తున్న...

పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వాలి

- సిఐటియు ఆధ్వర్యాన ధర్నా -వైద్యాధికారులకు వినతిపత్రాలు



అరకులో ఆందోళన చేపడుతున్న నాయకలు, కార్మికులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పాడేరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, అరకులోయ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం అరకులోయ ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్, ఆసుపత్రి పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రఘు మాట్లాడుతూ, పాడేరు, అరకు, చింతపల్లి, ముంచంగిపుట్టు ఆసుపత్రుల్లో పని చేస్తున్న ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఒక్కొక్క కార్మిడికి రూ.16000 జీతాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఒక్కొక్క కార్మికులకు రూ.9,000 నుండి 10,700 వరకు మాత్రమే జీతాలు చెల్లిస్తుందన్నారు. సెక్యూరిటీ గార్డులకు రూ.8,300 మాత్రమే చెల్లిస్తున్నారని తక్షణమే ప్రభుత్వ జీవో ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ కార్మికుల నుండి వసూలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం ఈఎస్ఐ చెల్లించడం లేదని తక్షణమే కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్ కింద జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో 200 పడకలకు గాను వంద పడకల సిబ్బందితోనే పని చేయిస్తున్నారని, అరకు ఏరియా 150 పడకల ఆసుపత్రిలో వంద పడకల సిబ్బందితో పని చేయిస్తున్నారని, పని భారం ఎక్కువ కావడంతో కార్మికులకు తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఇబ్బందీ పడుతున్నారని పేర్కొన్నారు. తగినంత సిబ్బందిని వెంటనే నియమించి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఫేషియల్ యాప్ విధానం రద్దు చేయాలన్నారు. యూనిఫామ్, జీతాలతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు మోహన్, కృప, సూర్య, కోటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు : ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు కాంటాక్ట్ విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్ ద్వారా జీతాలు చెల్లించాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు . బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమస్యలపై చింతపల్లి ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ ఆదిత్య కీర్తికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్తు కింద జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాడేరు, అరకు, ముంచంగిపుట్టు, చింతపల్లి ఆసుపత్రులలో 20 సంవత్సరాల నుండి పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారని తెలిపారు.పిఎఫ్ ఈఎస్ఐ కార్మికుల నుండి వసూలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం చెల్లించడం లేదన్నారు. సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా జీతాలు క్రమంగా చెల్లించి, పరికరాలు, యూనిఫామ్ పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది మంగ వేణి, ఎస్ .సుగుణమ్మ, ఎల్ ప్రియాంక, ఎస్ కే బేబీ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న పడాల్

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో వైద్యాధికారిని మౌనికకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ఉపాధ్యక్షులు పి.భీమరాజు మాట్లాడుతూ, చాలీ చాలని వేతనాలతో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు 16 వేల వేతనం రాష్ట్ర ప్రభుత్వం అందచేయాలని ఆయన డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్ ద్వారా జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరిశుధ్య కార్మికులు కాశీ, నారాయణ, సుబ్బలమ్మా, దేవీ, గాసి, రాజారావు, ధర్మంరావు పాల్గొన్నారు.


సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి

-ఎంపిపి కారం లక్ష్మి

- పునరావాస ఇళ్ల సర్వే పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులవుతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ఎంపిపి కాలం లక్ష్మి డిమాండ్ చేశారు. మండలంలోని ఒడ్డుగూడెం పంచాయతీ పరిధి ఒడ్డుగూడెం కాలనీ, ధర్మతాలగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న పునరావాస ఇళ్ల సర్వేను శుక్రవారం ఎంపిపి, సిపిఎం నాయకులు పరిశీలించారు. సర్వే చేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకొని, ఆ విధానం సరిగా లేదని తప్పు పట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ సర్వే చేసేటప్పుడు ఇంటి పొడవు, వెడల్పులు మాత్రమే చూస్తున్నారని, ఆ ఇంటి గోడలు సిమెంట్‌తో కట్టినవా, మట్టితో కట్టినవా అనేది పరిశీలించడం లేదని పేర్కొన్నారు. ఇంటి చుట్టూ నిర్మించిన ప్రహరీలను, ఇంటి ఆరుబయట చేసిన సిమెంట్ వాకిలిని చూడటం లేదన్నారు. ఒకవేళ ఇంటి యజమానులు అభ్యంతరం పెట్టినా పట్టించుకునే ఓపిక కూడా సర్వే చేసే అధికారులకు లేదని విమర్శించారు. సర్వే చేసేటప్పుడు గోడల నాణ్యతను కూడా చూడాలన్నారు. సంవత్సరంలో మూడు నాలుగు సార్లు వచ్చిన వరదలకు పూర్తిగా కొట్టుకుపోయిన ఇళ్లను కూడా సర్వే చేసి నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తాము నష్టపోయినా పర్వాలేదని భావించి పోలవరం ప్రాజెక్టు కోసం ఎన్నో తరాలుగా ఉంటున్న గ్రామలను త్యాగం చేస్తున్న గిరిజనులకు ఎటువంటి అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, గుండెపుడి లక్ష్మణరావు, పోడియం శ్రీరామ్మూర్తి, సోడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 75 వినతులు

-హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 75 అర్జీలు వచ్చాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవతో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ మాట్లాడుతూ, స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులకు అధికారులు జవాబుదారిగా వ్యవహరించాలన్నారు. కోర్టు కేసులకు కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు. ప్రతీ శుక్రవారం ఐటిడిఎలో నిర్వహించే స్పందనకు శాఖాధికారులు తప్పనిసరిగా ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆదేశించారు. స్పందనకు హాజరుకాని 8 మంది అధికారులకు షోకాజ్ నోటీస్ లు జారీ చేస్తామన్నారు. అత్యవసర పనులుంటే జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలన్నారు. ఐటిడిఎ పరిధిలోని అధికారులు పిఒ అనుమతి తీసుకుని వెళ్లాన్నారు. ముందస్తు అనుమతి లేకుండా స్పందనకు గైర్హాజరయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్పందనలో ఫిర్యాదులు

కొయ్యూరు మండలం కొప్పుకొండ కొత్త వీధికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. డుంబ్రిగుడ మండలం కండ్రుం గ్రామ పంచాయతీ ఖాంకగుడ గ్రామానికి అంగన్వాడీ కేంద్రం మంజూరు చేసి అంగన్వాడీ టీచరును నియమించాలని గ్రామస్తులు టి.పొరన్న, కె.భాస్కరరావు అర్జీని అందజేసారు. హుకుంపేట మండలం కేంద్రంలోని సర్వే నెం 49/4 ఉన్న స్మశాన వాటికను ఆక్రమించి గుడాలు ఏర్పాటు చేస్తున్నారని వై.ప్రభకారరావు, సిహెచ్.మన్మధ ఫిర్యాదు చేసారు. పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ మొండికోట, చెక్కరాయి, బొడ్డపుట్టు గ్రామాలకు తారురోడ్డు నిర్మించాలని ఎం.మత్స్యలింగం వినతి పత్రం సమర్పించారు. డుంబ్రిగుడ మండలం కండ్రుం పంచాయతీ సర్రాయి, జాకర వలస తాగునీటి పథకానికి విద్యుత్ ట్రాన్సఫార్మర్ ఏర్పాటు చేయాలని, దండగూడ, బైలుగూడ గ్రామాలకు సోలార్ తాగునీటి పథకం మంజూరు చేయాలని సర్పంచ్ కిముడు హరి వినతి పత్రం అందజేసారు. డుంబ్రిగుడ మండల చంపపట్టి గ్రామం వాగుపై వంతెన హుద్ హుద్ తుఫానులో శిథిలమైందని దానిని తిరిగి నిర్మించి పంచాయతిలోని చంపపట్టి, జాంకర వలస, సీలా గొంది, ఉయ్యాలగూడ, కోసంగి గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించాలని టి.దొబ్బన్న, టి.రాజు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ పి.అంబేద్కర్, ఐటిడిఎ ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, డిఎంహెచ్ఒ జమాల్ బాషా, టిడబ్ల్యు ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, ఆర్ డబ్ల్యుఎస్ ఇఇ లీలాకష్ణ, డిపిఆర్ ఒ పిఎస్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, ఐడిడిఎ పరిపాలనాధికారి హేమ పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా క్షయ నియంత్రణ అధికారి విశ్వేశ్వరరావు


మాట్లాడుతున్న. ఎంపీడీఓ పూర్ణయ్య

సాఫీగా మండల సమావేశం

ప్రజాశక్తి - పెదబయలు: మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోండా వరహాలమ్మ అధ్యక్షతన సాఫీగా సాగింది. ఈ సమావేశంలో ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు. కె.బొంజుబాబు మాట్లాడుతూ, మండల పరిషత్ క్వార్టర్స్‌లో ఉన్న 108 భవనం వర్షానికి కారి పోతుందన్నారు. గ్రామాల్లో సచివాలయాల ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించ లేదని పర్రెడా సర్పంచ్ తెలిపారు. వైద్యాధికారి సిందూరం పడల్ మాట్లాడుతూ, ఇద్దరు వైద్యాధికారులకు గాను ఒకరు ఫీల్డ్‌లో ఉంటూ . మరొకరు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కొంతమంది సమస్యలపై ప్రశ్నించకుండా మౌనం దాల్చారు.ఆరడకోట ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కొర్ర రాజాబాబు మాట్లాడుతూ, గత మూడు సర్వసభ సమావేశాలకు లక్ష్మీపేట, అడుగుల పుట్టు సెగ్మెంట్ ఎంపీటీసీ హాజరు కాలేదని అనర్హత వేటు వేయాలని డిమాండ్. చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ. పాంగి సోనే. (టీ డి పి)భర్త దర్జాగా సమావేశం మందిరంలో కూర్చొని ఉండటం విశేషం. వైస్ ఎంపీపీ పాంగి . సోనే. పై. చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్. చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ త్హశిల్దర్. భాస్కర్ రావు జడ్పీటీసీ కె బొంజుబాబు సీడీపీఒ. రాజేశ్వరి జి సి సి బ్రాంచి మేనేజర్ గాసి స్థానిక. సర్పంచ్ పి. మాధవరావు అటవీ శాఖ హౌసింగ్ తదితరులు పాల్గొన్నారు


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేత సన్నిబాబు

అంగన్‌వాడీల సమస్యలపై సిఐటియు వినతి

ప్రజాశక్తి పెదబయలు రూరల్ : మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో పని చేస్తున్న అంగనవాడి వర్కర్స్, హెల్పర్ల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని మండలం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు ఉపాధ్యక్షులు బొండా సన్ని బాబు మాట్లాడుతూ, గత ఎన్నో ఏళ్లగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం గ్రాడ్యుటీ చెల్లించటం లేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించ లేదన్నారు.ఉద్యోగ భద్రత, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, గ్రాడ్యువిటీ, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కిల్లో సర్బన్న, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు టి.రాజమ్మ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలకు మోడీ ప్రభుత్వం తూట్లు

ప్రచార భేరిలో సిపిఎం నాయకులు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి- విఆర్.పురం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆదివాసీ చట్టాలు, హక్కులకు భంగం కలిగిస్తుందని, తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం బిజెపి విధానాలకు తలాడిస్తూ గిరిజనులకు ముప్పు తలపెడుతున్నారని సిపిఎం నాయకులు విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు సిపిఎం, సిపిఐ సంయుక్తంగా ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయితీ పరిధి గుండుగూడెం గ్రామంలో శుక్రవారం ప్రచార భేరి నిర్వహించారు. ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు వడ్లాది రమేష్, కుంజ నాగిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి లేక పూట కూలీల జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు కూలి రూ.150 పడుతుందని, రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు రావాల్సిన అలవెన్స్‌లు, మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్టులు, టెంట్ ఇవ్వాలని, గునపం, తట్ట, పారకు కూలి ఇవ్వాలని కోరారు.


మోతుగూడెం ప్రాంతంలో...

మోతుగూడెం : చింతూరు మండలం తూలుకొండ, దబ్బాగూడెం గ్రామాల్లో సిపిఎం నాయకులు శుక్రవారం ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పల్లపు వెంకట్ ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులను కలుసుకొని బీజేపీ పాలన వల్ల జరుతున్న నష్టాన్ని, కార్మికులకు బీజేపీ చేస్తున్న ద్రోహాన్ని వివరించారు. మే 4న జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

4న బహిరంగ సభను జయప్రదం చేయండి

విఆర్ పురం : కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ, సిపిఎం కేంద్ర కమిటీల పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రచార భేరి సందర్భంగా మే 4న చింతూరులో జరగనున్న బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామంలో శుక్రవారం బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభపై ఇప్పటికే సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన కరపత్రాలు, గ్రూప్ మీటింగ్‌లు ద్వారా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. నేడు బిజెపి ప్రభుత్వం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ధ్వంసం చేస్తూ హైందవ ఆధిపత్య సంస్కృతిని గిరిజనులపై రుద్దుతుందని తెలిపారు. ఒకే భాష, ఒకే విద్య, ఒకే మతం అంటూ, భారత దేశ భిన్నత్వాన్ని దెబ్బతీస్తుందని, కట్టుకునే బట్ట, తినే తిండిపైనా ఆంక్షలు విధిస్తుందని విమర్శించారు. అమాయక ఆదివాసీల బుర్రల్లో విషాన్ని నింపుతుందన్నారు. ఈ భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి సున్నం దూలయ్య, నాయకులు చంద్రయ్య, రత్తయ్య, రాముడు, సున్నం రాముడు, రాజయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేకు ముందు గ్రామసభలు

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా సమగ్ర భూ రీ సర్వే చేసే సమయంలో ముందుగా గ్రామసభలు నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాల సర్వే అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, వీఆర్ఓలతో పిఒ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్వే రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి ఏ రైతుకు ఎక్కడెక్కడ హద్దులు ఉన్నావో సర్వే చేసి హద్దులు సంబంధిత రైతులకు చూపించాలని కోరారు. ఈ సర్వేలో ఎవరైనా రైతులను ఇబ్బందులు పెడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సర్వే ద్వారా ఎన్ని సమస్యలు పరిష్కరించిందీ మండలాల వారిగా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్.శాస్త్రి, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు రవిశంకర్, రాజశేఖర్, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఎం.సావిత్రి, తహశీల్దార్లు శ్రీమన్నారాయణ, సుబ్రమణ్యం, డిప్యూటీ తహశీల్దార్లు రామకృష్ణ, కె.సుధాకర్ బాబు, మండల సర్వేయర్ కుమారి, విఆర్ఒలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై గిరిజన గ్రామాల్లో అవగాహన

వైద్యాధికారులకు జిల్లా క్షయ నియంత్రణ అధికారి ఆదేశం

ప్రజాశక్తి -సీలేరు

క్షయ వ్యాధి పట్ల మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు సీలేరు, ధారకొండ వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ హిమబిందును ఆదేశించారు. జీకే వీధి మండలం సీలేరు, ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించి తనిఖీలు చేశారు. ఆయా పిహెచ్‌సిల్లో క్షయ వ్యాధిగ్రస్తులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యటిస్తూ టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలున్న వారికి కళ్లే పరీక్ష నిర్వహించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే వారికి తక్షణమే వైద్య సేవలు అందించాలని, రోగి క్రమం తప్పకుండా మందులు వాడుతున్నారా లేదా అనేది వైద్య సిబ్బంది, టీబీ సూపర్వైజర్లు తెలుసుకోవాలని చెప్పారు. క్షయ నిర్ధారణ పరీక్షలు పెంచాలని, వ్యాధిగ్రస్తులకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలని, పౌష్టికాహారం తీసుకోపోతే జరిగే నష్టంపై వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. టీబీ రోగుల సమాచారాన్ని ఆన్లైన్లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసి జిల్లా అధికారులకు సమాచారం చేరవేయాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు ఆరు నెలలు మందులు వాడిన తర్వాత వారికి పరీక్షలు నిర్వహించి తగ్గిందో లేదో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ విగ్నేష్, డిటిసి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్య, సీలేరు హెల్త్ సూపర్వైజర్ త్రినాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సబ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం : డివిజన్ కేంద్రం రంపచోడవరం సబ్ పోస్టాఫీసులో ఈ నెల 26వ తేదీ నుండి ఆధార్ సర్వీసులు ప్రారంభించినట్లు సబ్ డివిజనల్ పోస్టు ఇన్‌స్పెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో ఆధార్ నవీకరణ, తప్పులను సరిదిద్దడం, ఆధార్ నమోదు వంటి సేవలు అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు. రంపచోడవరం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సందేహాలు నివృత్తి కోసం రంపచోడవరం సబ్ పోస్టాఫీసును సంప్రదించాలని కోరారు.

కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం గిరిజన మిత్ర వెల్ఫేర్ సొసైటీ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న పేదలు, చిన్నారులు, వృద్ధులకు మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ శ్రీనివాస్ చేతులమీదుగా శుక్రవారం కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలోని కంటి చూపు సమస్యలున్న గ్రామాల్లో గిరిజనమిత్ర సిబంది సర్వే చేసి ఉచిత కంటి వైద్యం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన మిత్ర సిబంది నాగేశ్వరవురాజు, లోవ, అరుణ, శివకృష్ణ, లింగరాజు పాల్గొన్నారు.


కళ్లద్దాలు అందజేస్తున్న గిరిజన మిత్ర ప్రతినిధులు

చిరుధాన్యాల సాగుకు ఏజెన్సీ అనుకూలం

ఐటిడిఎ పిఒ వి.అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరుటౌన్: గిరిజన ప్రాంతం చిరుధాన్యాల సాగుకు స్వర్గధామమని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ అన్నారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. గిరిజన రైతులకు వ్యవసాయ ఉపకరణాలు అందించడానికి కషి చేస్తామని చెప్పారు . పసుపు కొనుగోలును ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళతామన్నారు. గత రెండు సంవత్సరాలలో ఏజెన్సీలో సాగు చేస్తున్న చిరుధాన్యాల సాగుపై వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీలో తిరుగుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పల్లెలకు పరిమితమైన చిరుధాన్యాల వినియోగం, ప్రపంచంలో అత్యధిక శాతం ప్రజలు విరుధాన్యాల వినియోగిస్తున్నారని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పిటిజి గ్రామాలలో పర్యటించినపుడు చిరుధాన్యాలు సాగుపై ఆరా తీస్తానన్నారు. ఏజెన్సీలో గిరిజన రైతులు సేంద్రీయ విధానంలోనే విరుధాన్యాలు సాగు చేస్తున్నారని చెప్పారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం. సరస్వతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వ్యవసాభివ ద్దిని ప్రోత్సహించాలన్నారు. ఏప్రిల్ నెలలోనే రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని అన్నారు. చిన్నపాటి వ్యవసాయ యంత్రాలను రైతులకు పంపిణీ చేస్తే గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విక్ డ్యాం మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలని చెప్పారు. రైతులకు బాపట్ల రకం జీడి మామిడి మొక్కలు పంపిణీ చేయాలని చెప్పారు. గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలలో పండ్ల తోటలు పెంచే విధంగా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం పట్టుపరుగలు పెంపకంపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, వ్యవసాయ సలహా మండలి బోర్డు డైరెక్టర్ కన్నాపాత్రుడు, అరకు, పాడేరు, చింతపల్లి వ్యవసాయ సహాయ సంచాలకలు, మండల వ్యవసాయాధికారులు పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజెన్సీ భూముల ధరల స్థిరీకరణపై సమీక్ష

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలో గిరిజన భూముల ధరల స్థిరీకరణపై ఇన్చార్జి సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో 11 మండలాల తహాశీల్దారుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాడేరు డివిజన్ పరిధిలో గిరిజన భూములకు రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ అధికారులు సమగ్రమైన సర్వే చేసిన ధరలను పరిశీలించి తగిన సూచనలు చేసారు. ఈ సమావేశంలో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ అధికారి బాలకష్ణ, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్, 11 మండలాల తాహాశీల్దారులు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన స్పందన సమస్యల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : స్పందనలో స్వీకరించిన సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సమస్యలను పరిష్కారించాలని ఆదేశాలు జారీ చేసారు. స్పందన పోస్టల్ లో నమోదు చేసిన ఫిర్యాదులను 24 గంటల్లో పరిశీలించి అర్జీదారునితో మాట్లాడి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించి, ఆర్థిక పరమైన సమస్యలను ప దష్టికి తీసుకుని రావాలని అన్నారు. ఫిర్యాదులపై సక్రమంగా ఎండార్సుమెంటు వేసి, అధికారి సంతకం పెట్టి పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. అర్జీదారునికి సరైన సమాధానాన్ని పంపించాలని అన్నారు. అర్జీదారునితో మాట్లాడి ఫోటో తీసుకుని పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ.కొండలరావు, తాహాశీల్దారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంత ఆశీలు వేలం పాట ఖరారు



వేలం ఖరారు పత్రాన్ని ఇస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-హుకుంపేట:స్థానిక పంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ అధ్యక్షతన సంత ఆశీల వేలం పాట శుక్రవారం ఉదయం నిర్వహించారు. కాసులు గోవింద్‌రావు వేలంపాటను దక్కించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ వేలం పాట దారుడు 3 సమాన వాయిదాల పద్ధతిలో పంచాయతీకి చెల్లించుటకు ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించడం జరిగిందన్నారు. వారపు సంతలో చెత్త చెదారం లేకుండా శుభ్రపరిచాలని వేలం పాట దారునికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీ పరశు రామ్, సెక్రటరీ సాగర్, ప్రదీప్, గ్రామ పెద్దలు జన్ని అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:విద్యార్థులకు విద్యా బోధన చేయడంతో పాటు గ్రామంలోని చదువుకున్న నిరుద్యోగ యువత, గ్రామస్తులు చెడు వ్యసనాలకు పోకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న మండలంలోని నడిమి వలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, అల్లూరి జిల్లా మానవ హక్కుల నేర నిరోధక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ధర్మను ఆ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆయన సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దారని గ్రామస్తులు దేవగున్, అర్జున్, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, గోవింద్ తెలిపారు.

చదువు విషయంలో పిల్లలపై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ): చదువు విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు ఎటువంటి ఒత్తిడీ చేయకూడదని, వారికి ఆసక్తి ఉన్న సబ్జెక్టును చదువుకోవడానికి అవకాశం కల్పించాలని జివిఎంసి అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు హితవుపలికారు. బుధవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో శ్రీ గణేష్ జూనియర్ కాలేజీ (ఎంవిపి కాలనీ)కి చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా శుక్రవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విద్యార్థుల, వారి తల్లిదండ్రుల అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల చదువు పట్ల ఇతరులతో పోల్చవద్దన్నారు.

కాలేజీ చైర్మన్ లక్ష్మీ గణేష్ మాట్లాడుతూ తాము కాలేజీ ప్రారంభించిన ఏడాదిలోనే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించడం గర్వంగా ఉందన్నారు. ప్రథమ ఇంటర్ ఎంపిసిలో 470కి షేక్ హైదర్ 465, పాలూరి లలితాశ్రీ ఆదిత్య 463, కోన లక్ష్మీసాయి లహరి 463, టి.శరత్ కుమార్ 462 మార్కులు సాధించారని, మిగిలిన విద్యార్థులు మంచి మార్కులతో హవా చూపించారన్నారు. బైపిసి విభాగంలో 440కి ఎస్.జారోలి 409, వి.దీపికా 404 సాధించారని, ద్వితీయ సంవత్సర విభాగంలో1000కి బి.నిహారిక ప్రియ 971, సిహెచ్.ప్రణవ్‌కుమార్ 965, జె.తరుణ్ 962 సాధించారని, ఈ ఫలితాలు విశాఖ నగరానికి గర్వకారణమని తెలిపారు. ఈ విజయం సాధించడంలో దోహదపడిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణ చైతన్య, అధ్యాపక సిబ్బందికి, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

తాగునీటికి గిరిజనుల వెతలు



సుదూరం నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న గిరి మహిళలు

ప్రజాశక్తి- పెదబయల్ రూరల్:కొరవంగి గ్రామ పంచాయతీ బొడ్డగుంది గ్రామంలోని గిరిజనులను తాగునీటి సమస్య వెంటాడుతోంది. తాగునీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు స్థానిక సర్పంచు, ఎంపీటీసీలు ప్రభుత్వ అధికారులకు తమ గోడును వినిపించినా స్పందించిన నాథుడే లేడని స్థానికులు వాపోయారు.గ్రామానికి సమీపంలో 3కిలోమీటర్ల దూరంలో ఉన్న బాసెలు గ్రామం నుంచి కొన్నాళ్లుగా గొట్టాలు అమర్చుకుని నీళ్ళు వాడే వారిమన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో గ్రామం కింద పొలాల్లో నీరు పూర్తిగా ఇంకి పోయిందన్నారు. దీంతో తాగునీరు సమస్య మరింత జటిలం అయ్యిందని గ్రామానికి చెందిన మహిళలు నాగమ్మ, రాజులమ్మ, దేవి నారాయణమ్మ తదితరులు విలేకర్ల ముందు వాపోయారు. పలుమార్లు తాగునీరు సమస్య పరిష్కరించాలని సర్పంచ్, ఎంపీటీసీలు సంబధిత అధికార్లకు తమ గోడు విన్నవించినా నిధులు లేవని చేతులెత్తేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దున లేవగానే నీరు సేకరించుటకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంటుదన్నారు. వర్షపు నీటిని తాగడంతో వ్యాదుల బారిన పడి రోగాలతో ఇబ్బంది పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు తాగు నీరు అందించాలని గ్రామానికి చెందిన గిరిజనులు నారాయణ భాస్కర్, మత్స్య రాజు, గణపతి, పురుషోత్తం, ప్రసాద్, మత్యలింగం తదితరులు కోరారు.



ఊటకుంటలోని కలుషిత నీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు

శ్వేత ఆత్మహత్య కేసులో వీడిన మిస్టరీ

అత్తింటి వేధింపులే కారణం : కమిషనర్ త్రివిక్రమ వర్మ

భర్త, అత్తామామలతో పాటు ఆడపడుచు భర్త అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి విశాఖలోని వైఎంసిఎ బీచ్ వద్ద మృతురాలిగా కనిపించిన వివాహిత గురువెల్లి శ్వేత (24) అత్తింటి వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుందని నగర పోలీసు కమిషనర్ సిఎం త్రివిక్రమ వర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను వివరించారు. 2022 ఏప్రిల్‌లో ఆమెకు పెదగంట్యాడకు చెందిన మణికంఠతో వివాహం జరిగిందని, అనంతరం కొంతకాలం ఇరువురూ బాగానే ఉన్నారని తెలిపారు. భర్త మణికంఠకు హైదరాబాదులోని ఐటీ సంస్థలో ఉద్యోగం రావడంతో అక్కడకు వెళ్లిపోయాడని, శ్వేత తమ అత్తమామలైన శాంతరావు, పుష్పవతిలతో పెదగంట్యాడలోనే నివాసం ఉంటోందని తెలిపారు. ఆమెను వారు తరచూ వేధించేవారని, అంతేకాకుండా ఆడపడుచు భర్త యన్ని సత్యనారాయణ ఆమెను లైంగికంగా వేధించేవాడని తెలిపారు. ఈ విషయాన్ని శ్వేత భర్తకు తెలిపినప్పటికీ ఆయన కూడా సత్యనారాయణకు అనుకూలంగా మాట్లాడేవాడిని, ఈ సమస్యలన్నిటినీ భరించలేక ఆమె ఈ నెల 25 సాయంత్రం 6:20 గంటలకు భర్తతో గొడవపడి ఫోన్‌ను ఇంటి వద్దనే వదిలేసి బయటకు వెళ్లిపోయిందని చెప్పారు. శ్వేత కనపడకపోవడంతో తెలిసిన ప్రాంతాల్లో వెతికిన అత్తమామలు ఆమె తల్లికి సమాచారం ఇవ్వడంతో రాత్రి 11 గంటల సమయంలో కేసు నమోదైందని తెలిపారు. 26 అర్ధరాత్రి 12:30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని యువతి మృతదేహం బీచ్ వద్ద ఉందని అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై శ్వేత మృతదేహంగా గుర్తించారన్నారు. ఈ కేసులో విచారణ అనంతరం భర్త, అత్తమామలు, ఆడపడుచు భర్తలను అరెస్ట్ చేసి, వారిపై వరకట్న వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించడం సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఇవే కారణాలతో శ్వేత గతంలో కూడా ఒకసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు విచారణలో తేలిందని సిపి తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న సిపి

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక విద్య

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



అవార్డు అందజేస్తున్న ఆర్థికమంత్రి బుగ్గన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పరిశ్రమలు నాణ్యమైన ఉత్పత్తిని సాధించాలంటే వృత్తి నైపుణ్యత కలిగిన కార్మికుల అవసరం ఎంతైనా ఉంటుందని, అందుకు అనుగుణంగా ఐటిఐ, పాలిటెక్నికల్ కళాశాలల సిలబస్‌లో సమూల మార్పులు తీసుకురానున్నామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2023 ప్రదానోత్సవం నగరంలోని నోవాటెల్ హోటల్లో శుక్రవారం జరిగింది.

ఈ కార్యక్రమానికి మంత్రి బుగ్గనతోపాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ ఐటిఐలలో అభ్యర్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడం లేదని, వాళు కోర్సు పూర్తి చేసుకుని బయటికి వచ్చిన తర్వాత ఏ పరిశ్రమలోనూ పనిచేయటానికి వారి అర్హత సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఐటిఐలను బలోపేతం చేసి, తద్వారా అభ్యర్థులకు నాణ్యమైన సాంకేతిక శిక్షణ అందించాలని నిర్ణయించిందని చెప్పారు. ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రయోగశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. అలాగే ఆయా ప్రాంతాలలోని పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన అభ్యర్థులను తయారు చేసే విధంగా ఐటిఐ, పాలిటెక్నికల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలియజేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక ప్రగతికి ఫ్యాప్సీ ఎంతగానో కషి చేస్తోందని అన్నారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వస్తే ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. వేర్ హౌసింగ్‌ను ఇండస్ట్రియల్ సెక్టర్లోకి తీసుకువచ్చామని ఆయన తెలియజేశారు. పిసిపిఐఆర్ పరిధిలో 6500 ఎకరాల భూమిని పారిశ్రామిక అవసరాల కోసం సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని సహజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఆదిత్యానాథ్ దాస్, విశ్రాంత సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, ఫ్యాప్సీ అధ్యక్షులు కరుణేంద్ర జాస్తి, మాజీ అధ్యక్షులు సివి.అచ్యుతరావు, ఉపాధ్యక్షులు కె.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 11 రంగాలలో రాణించిన వారికి ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డులను మంత్రులు అందజేశారు.

30న గీత్ సంగీత్ ఆధ్వర్యంలో నిర్విరామ గీతాలాపన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గీత్ సంగీత్ సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న విభిన్న భాషలలో 10 గంటల పాటు 160 పాటలను ఆలపించి, సరికొత్త రికార్డును నెలకొల్పేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని అభినందిస్తున్నట్లు లీడర్ దినపత్రిక ఎడిటర్ వివి.రమణమూర్తి తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ వ్యవస్థాపకులు, రిటైర్డ్ పోలీస్ అధికారి, ప్రముఖ గాయకులు మహమ్మద్ ఖాన్ నేతృత్వంలో ఈ ప్రయత్నం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. 64 ఏళ్ల వయసులో ఇటువంటి రికార్డు సాధనకు ప్రయత్నించడం విశేషమన్నారు. సంస్థ వ్యవస్థాపకులు, రిటైర్డ్ పోలీసు అధికారి మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ ఈ నెల 30న విశాఖ పౌర గ్రంథాలయంలో ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐదు విభిన్న భాషలలో 10 గంటలపాటు 15 మంది గాయనీగాయకుల సహకారంతో సుమారు 160 పాటలతో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ కోరుకొండ రంగారావు, కొణతాల రాజు, ఎంవిఆర్ నాగేశ్వరరావు, గీత పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

పోస్టల్ ఉద్యోగుల ఆందోళనకు మద్దతు : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోస్టల్ ఉద్యోగుల జాతీయ సమాఖ్య (ఎన్ఎఫ్‌పిఇ), ఆలిండియా పోస్టల్ ఉద్యోగుల యూనియన్ (పి3) సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ చర్యను విశాఖలో ఉన్న అన్ని ప్రభుత్వరంగ కార్మికులు, ఉద్యోగులూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పోస్టల్ ఉద్యోగుల యూనియన్ రద్దు చర్యకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయని, వాటికి తాము మద్దతునిస్తున్నామని వెల్లడించారు. పోస్టల్ యూనియన్‌లో ఉన్న బిఎంఎస్ సంఘం ద్వారా తప్పుడు ఫిర్యాదులను కేంద్ర ప్రభుత్వం రప్పించుకొని ఈ అనైతిక చర్యకు పాల్పడిందని విమర్శించారు.

30న ఏకలవ్య ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ : ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 30న మధురవాడ మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యల్. శివ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్ టికెట్లు వెబ్ సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే, తమ అర్హత ధ్రువపత్రాలతో పరీక్ష కేంద్రానికి వచ్చి సంబంధిత అధికారులను సంప్రదించి పరీక్ష రాయవచ్చునని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

మేడేను జయప్రదం చేయండి

సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న సిపిఎం నేత నాగేశ్వరరావు

ప్రజాశక్తి -ఎటపాక : శ్రమ జీవులందరూ మేడే రోజున వాడవాడలా ఎర్రజెండాలు ఎగరేసి ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కెఎన్.పురం గ్రామంలో పార్టీ నాయకులు ఆకిశెట్టి రాము అధ్యక్షతన శుక్రవారం జరిగిన సిపిఎం మండల విస్తృత స్థాయిలో సమావేశం నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రపంచ కార్మికులందరూ ఐక్యమై పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానం, వేతనాల పెంపును నేటి పాలకులు అమలు చేయకుండా ఎత్తివేసే చర్యలకు పూనుకుంటున్నారని తెలిపారు. నేటి పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలు బొమ్మలుగా మారిపోయాయని, అందుకే మేడే స్ఫూర్తితో శ్రామికులందరూ ఏకమై కోల్పోతున్న హక్కులు, చట్టాలను తిరిగి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచిందని, ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులను గాలికొదిలేశాయని, గిరిజన హక్కులు, చట్టాలను నీరుగారుస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే మే 4న చింతూరులో జరగనున్న బహిరంగ సభకు ప్రజలు, కార్మికుల పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు డి.మాధవరావు, ఐ.పద్మ, నాయకులు సోయం వీరమ్మ, జి.హుస్సేన్, కాకా అర్జున్, బుద్దుల భద్రయ్య, సవలం రాము, ఇరపా సత్యం, సీసం అర్జున్, అపకా సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలు ప్రారంభం



కుళాయిలు ప్రారంభిస్తున ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండల కేంద్రంలోని రామాలయం వీధిలో తాగునీటి సమస్యను తీర్చారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా నూతనంగా కుళాయిలను ఏర్పాటు చేశారు. వీటిని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. రూ.3లక్షల మండల ప్రజా పరిషత్ నిధులతో ఈ కుళాయిలను ఏర్పాటు చేసినట్టు ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ కిముడు రాంబాబు, మండల అధ్యక్షుడు మత్స్యకొండం నాయుడు , మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయిత్రి, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర, సచివాలయం కన్వీనర్ అడపా బాబురావు, సీనియర్ నాయకులు మత్స్యరాస బంగార్రాజు, అబ్బాయి దొర, సోషల్ మీడియా కన్వీనర్ సాగేని లక్ష్మణ్ పాల్గొన్నారు.

3న విశాఖకు సిఎం జగన్

భోగాపురం ఎయిర్‌పోర్టు, వైజాగ్ టెక్ పార్క్‌లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపనలో పాల్గొనేందుకు సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మే 3న విశాఖ రానున్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యటన వివరాలను ముఖ్యమంత్రి ప్రత్యేక అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం మీడియాకు విడుదల చేశారు. ఈ పర్యటనలో భాగంగా 8:20 గంటలకు సిఎం గన్నవరంలో ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 9:20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9:30 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా భోగాపురం మండలంలోని ఎ.రావివలస గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జిఎంఆర్ ఎక్స్పీరియన్స్ సెంటర్‌కు వెళతారు. అనంతరం 10:30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తారు.

ఈ కార్యక్రమం అనంతరం 1:20 గంటలకు ఎ.రావివలస గ్రామం నుంచి బయలుదేరి 1:40 గంటలకు మధురవాడలోని ఐటి హిల్స్ 4 వద్దకు చేరుకుంటారు. 1:50 గంటలకు అదానీ గ్రూప్ సంస్థకు చెందిన వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధురవాడలోని ఐటి హిల్స్‌లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో పాల్గొని 3:50 గంటలకు విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ తనయుడు శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులను ఆశీర్వదించేందుకు వెళ్తారు. 3.55 గంటలకు స్థానిక నాయకులతో సమావేశమవుతారు. 5.20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని 6:20 నిమిషాలకు గన్నవరం వెళ్తారు.

కిడ్నీ మాఫియాపై సమగ్ర దర్యాప్తు చేయాలి

దోషులను కఠినంగా శిక్షించాలి

బాధితునికి రూ.50 లక్షలు నష్టపరిహారమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖలో కిడ్నీ మాఫియా చర్యలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని, తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలను టార్గెట్ చేసుకొని వ్యాపారం సాగిస్తున్న వైనం మరోసారి విశాఖలో వెలుగుచూసిందన్నారు. ఈసారి మధురవాడ వాంబే కాలనీకి చెందిన జి.వినయ్‌కుమార్‌ను కిడ్నీ మాఫియా ఉచ్చులో బిగించిందని తెలిపారు. ఆ వ్యక్తేకాకుండా ఇంకా అనేకమంది ఈ ముఠా ఉచ్చులో పడ్డారన్న విషయం వెలుగుచూసిందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. భవిష్యత్తులో ఇవి పునరావృత్తం కాకుండా కిడ్నీ మాఫియా చర్యలను నివారించాలని డిమాండ్ చేశారు.

కిడ్నీ కోల్పోయి, మోసపోయి తీవ్ర అనారోగ్యం పాలైన జి.వినయ్‌కుమార్ కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ తొలగింపునకు శస్త్ర చికిత్స చేయించిన పెందుర్తిలోని శ్రీ తిరుమల ఆసుపత్రి నిర్వహణకు రిజిస్ట్రేషన్ కూడా లేదని అధికారులు చెబుతున్నారని, ఐదు సంవత్సరాల నుంచి ఆసుపత్రిని నడుపుతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోందని జగ్గునాయుడు ప్రశ్నించారు. కిడ్నీ మాఫియాకు అవకాశమిచ్చిన ఆసుపత్రి యాజమాన్యాన్ని శిక్షించాలన్నారు. విశాఖలో కిడ్నీ మాఫియాను అరికట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు.

జగన్‌ది తప్పుల తడకల ప్రభుత్వం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డిది తప్పులు తడక ప్రభుత్వం అని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విమర్శించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇచ్చిన జీవోలు మీద నెంబర్లు లేకుండా జగన్ ప్రభుత్వం ఇస్తుందని రాయడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రభుత్వం సక్రమంగా పనులు చేయలేదని విమర్శించారు. సమావేశంలో టిడిపి జోన్ 1 మీడియా కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్నరెడ్డి, బొట్టా వెంకటరమణ, కాళ్ళ శంకర్, ఆళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.